నేడు కలెక్టరేట్‌లో యథావిధిగా స్పందన

ప్రజాశక్తి - కాకినాడ

జగనన్నకు చెబుదాం జిల్లా స్థాయి స్పందన ప్రజా విజ్ఞాపనల స్వీకార కార్యక్రమం సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి కలెక్టరేట్‌లో యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ డాక్టర్ కృతికాశుక్లా ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీదారులు, జిల్లా అధికారులు ఈ విషయాన్ని గమనించాలని కలెక్టర్ సూచించారు. అలాగే డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం మంగళవారం ఉదయం 10.30 గంటల నుంచి 11.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజలు తమ సమస్యలను టోల్ ఫ్రీ నెంబర్ 18004253077కు ఫోన్ చేసి తెలియజేయొచ్చన్నారు. ఈ కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'కౌలు' కార్డులు కొందరికే...

భూ యాజమాని సంతకం నిబంధనతో అన్యాయం

ప్రభుత్వ సాయానికి దూరంగా కౌలుదారులు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

జిల్లాలో పంటలను సాగు చేస్తున్న వారిలో 80 శాతం మంది కౌలు రైతులే ఉన్నారు. సర్కారు నుంచి కనీస సాయం అందక ఏటా నష్టాలను చవిచూస్తున్నారు. అప్పుల ఊబిలో కూరుకుపోయి చివరకు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. సిసిఆర్ కార్డులు(పంట సాగు హక్కు పత్రాలు) ఉంటేనే పథకాలు ఇస్తామని ప్రభుత్వం చెబుతోంది. మరో పక్క కార్డులను ఇవ్వడానికి సవాలక్ష నిబంధనలు పెట్టంది. ముఖ్యంగా కార్డు కోసం భూ యాజమాని సంతకం తప్పనిసరి నిబంధనతో వారికి కార్డులను దూరం చేసింది. యజమానులు సంతకం పెట్టేందుకు నిరాకరించడంతో వేలాదిమంది కౌలు రైతులు రైతు భరోసా, పంట నష్టపరిహారం, పంట రుణాలు, పంటల బీమా వంటివాటికి దూరమవుతున్నారు.



కాకినాడ జిల్లాలో 2.20 లక్షల మంది రైతులకు 1.76లక్షల మంది అంటే 80 శాతం మంది కౌలు రైతులే వాస్తవ సాగుదారులుగా ఉన్నారు. ప్రభుత్వం మాత్రం సీసీఆర్ కార్డులు కొందరికే జారీ చేస్తోంది. గతేడాది 43 వేల మందికి అంటే 24.43 శాతం మందికి మాత్రమే కౌలుదారు కార్డులిచ్చింది. ఈ ఏడాదీ అదేతీరులో వ్యవహరిస్తోంది. ఖరీఫ్‌లో 43,400 మందికి కార్డులివ్వాలని అధికారులు లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఇప్పటి వరకూ కాకినాడ జిల్లాలో 31 వేల మందికి ఇచ్చారు. అధికారులు లక్ష్యాన్ని నిర్దేశించడంలోనే లోపాలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పరంగా అందుతున్న పథకాలు వాస్తవ సాగుదారులకు దూరమవుతున్నాయి.

కౌలుదారు కార్డులు లేక పెట్టుబడి సాయం అందక కౌలురైతులు ప్రవేయివేటు అప్పులు చేస్తున్నారు. కష్టపడి పండించినా గిట్టుబాటు ధర ఉండట్లేదు. ప్రకృతి విపత్తుల వల్ల పంటను కోల్పోతే నష్టపరిహారం కూడా అందని పరిస్థితి. ఫలితంగా చేసిన అప్పులకు కనీసం వడ్డీలు కూడా చెల్లించలేక, ఆర్థిక ఇబ్బందులతో తీవ్రంగా సతమతం అవుతున్నారు. కుటుంబ పోషణకు సైతం అవస్థలు పడుతున్నారు. అప్పుల ఊబి నుంచి బయటకు రాలేక పోతున్నారు. మనస్తాపానికి గురై బలవన్మరణాలకు ప్పాలడుతున్నారు.కాకినాడ జిల్లాలో ఈ ఏడాది గత 43 రోజుల వ్యవధిలో కరప, తాళ్లరేవు మండలాలకు చెందిన వనుం త్రిమూర్తులు (48), బొడ్డు గంగాధరరావు (46), బావిశెట్టి శ్రీనివాసరావు (43), గుండుపల్లి ఆంజనేయులు (41), బొడా చిట్టిబాబు (46) కౌలు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఇందులో ఇద్దరు దళిత రైతులు కూడా ఉన్నారు.

అప్పులే మిగులుతున్నాయి

10 ఎకరాలు కౌలుకి సాగు చేస్తున్నాను. సిసిఆర్ కార్డుల కోసం మా గ్రామంలో ఎవరికీ భూ యజమానులు సంతకాలు పెట్టడం లేదు. అప్పులు చేసి పెట్టుబడులు పెడుతున్నాం. నష్టాలు వస్తే తామే భరిస్తున్నాం. ప్రభుత్వ నిబంధనలు వలన తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

- గుడాల మూలారెడ్డి, కౌలు రైతు, నాగులాపల్లి, యు.కొత్తపల్లి మండలం

యజమాని ఒప్పుకోవట్లేదు

ప్రతి సంవత్సరం ఏడు ఎకరాలు కౌలుకు సాగు చేస్తున్నాను. భూ యజమాని ఒప్పుకోకపోవడం వల్ల సిసిఆర్ కార్డు దక్కలేదు. ప్రతి ఏటా నష్టాలు వస్తున్నాయి. ప్రభుత్వ సాయం అందడం లేదు. నిబంధనలు సడలించి కార్డులు ఇవ్వాలి.

- చింతపల్లి రాంబాబు,కౌలు రైతు, కొయ్యేరు, కాజులూరు మండలం

సమస్యలపై సమరం

కనీస వేతనాలకు నోచుకోని అంగన్‌వాడీలు

హామీలను అమలు కోసం నేటి నుంచి 36 గంటల పాటు ధర్నా

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

తమ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీలు దశలవారీగా పోరాటాలు నిర్వహిస్తున్నారు. ప్రతి పక్షంలో ఉండగా ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మరోమారు ఈనెల 10, 11 తేదీల్లో ఉద్యమించనున్నారు. కాకినాడ కలెక్టరేట్ వద్ద 36 గంటల పాటు ధర్నా నిర్వహించి నిరసన తెలియజేయనున్నారు. కనీస వేతనాలు ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్లు రూ.5 లక్షలకు పెంచాలనే తదితర డిమాండ్ల సాధనకు కోసం వారు ఈ నిరసన చేపడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో 5,546 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిల్లో సుమారు 5 వేల మంది అంగన్‌డీ కార్యకర్తలు, 4,818 ఆయాలు పని చేస్తున్నారు. వీరందరికీ సకాలంలో కనీస వేతనాలు అందక, ఇచ్చే అరకొర జీతాలు కుటుంబ పోషణకు సరిపోక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. ప్రతిపక్ష హోదాలో ఉన్నప్పుడు అంగన్‌వాడీలకు తెలంగాణలో ఇస్తున్న వేతనం కంటే అదనంగా రూ.1000 చెల్లిస్తానని చెప్పారు. అయితే తెలంగాణ రాష్ట్రం కంటే రూ.2 వేలు తక్కువ వేతనాలు చెల్లిస్తూ మాట తప్పిన జగన్ తీరుపై వర్కర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పథకాలకు దూరమై కష్టాలు అనుభవిస్తున్నారు. కర్ణాటక, కేరళ, గుజరాత్ రాష్ట్రాలలో సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ ఆయా రాష్ట్రాలు అమలుకు సిద్ధపడుతుంటే ఆంధ్రప్రదేశ్ లో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం స్పందించడం లేదు. పని ఒత్తిడి తీవ్రంగా పెరిగడమే కాకుండా రాజకీయ నాయకులు, అధికారుల వేధింపులతో సతమతం అవుతున్నారు. 2017 నుంచి టిఏ బిల్లులు పెండింగ్లో ఉన్నాయి. నిబంధనల ప్రకారం ఆయాలకు ప్రమోషన్స్ కల్పించడం లేదు.

వేతనంతో కూడిన మెడికల్ లీవ్ సౌకర్యం లేక నష్టపోతున్నారు. ఇలా అనేక సమస్యల నడుమ పని భారం వీరిపై తీవ్రంగా పెరిగింది. అయినా ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలపై నోరు మెదపడం లేదు. వైసిపి అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు దాటినా ఒక్క సమస్య కూడా పరిష్కరించలేదు. ఈ నేపథ్యంలో యూనియన్ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా ఈ నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా వ్యాప్తంగా వేలాదిమంది వర్కర్లు పాల్గొననున్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం : ఎంఎల్ఎ పొన్నాడ

ప్రజాశక్తి - తాళ్లరేవు

ముమ్మిడివరం నియోజకవర్గంలో రూ.150 కోట్లతో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపామని ఎంఎల్ఎ పొన్నాడ వెంకటసతీష్‌కుమార్ తెలిపారు. చొల్లంగిపేట పంచాయతీ కొబ్బరి చెట్టు పేటలో ఒఎన్‌జిసి సిఎస్ఆర్ నిధులు రూ.40 లక్షలతో నిర్మించిన వాటర్ ట్యాంకును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ కందిళ్ళ గంగాభవాని అధ్యక్షతన జరిగిన సభలో ఎంఎల్ఎ మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి, కేంద్ర ప్రభుత్వ సహకారంతో జలజీవన్ మిషన్ ద్వారా రూ.100 కోట్లు, సిఎస్ఆర్ నిధులు రూ.50 కోట్లతో నియోజకవర్గ వ్యాప్తంగా ఇంటింటికీ కొళాయిలు వేస్తామన్నారు. మండలంలో 23 వాటర్ ట్యాంకులు నిర్మించినట్లు తెలిపారు. చొల్లంగి పేటలో రూ.74.50 లక్షలతో ఇంటింటికి కొళాయిలు, పైపులైన్లు వేస్తామన్నారు. ఎంపిపి రాయుడు సునీత, ముమ్మిడివరం ఎఎంసి చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, మాజీ సర్పంచ్ మైదు హరిబాబు, కె.గంగబాబు మాట్లాడారు. వైసిపి మండల అధ్యక్ష, కార్యదర్శులు కాదా గోవింద్‌కుమార్, రాయుడు గంగాధర్, నాయకులు కొపనాతి నాగరాజు, బూరెల వెంకటరాజు, దున్న శ్రీకాంత్, భూసారపు పద్మారావు, స్థానిక ఎంపీటీసీ కడియాల మహాలక్ష్మి, శ్రీను, టిల్ల పూడి నాగేశ్వరరావు, కామాడి మాతరాజు, పేర్ని ఆదినారాయణమూర్తి, పినపోతు కామేశ్వరరావు, వార సూర్యకుమారి, కొప్పిశెట్టి వెంకట్, అంకాడి అంజిబాబు, గంపల నాగేశ్వరరావు, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కొళాయిని ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ పొన్నాడ సతీష్

సిపిఆర్‌తో ప్రాణం పోసిన డాక్టర్ యనమదల

ప్రజాశక్తి - కాకినాడ

గుండెపోటుకు గురైన పర్యాటకుని సకాలంలో సిపిఆర్ చేసి ప్రాణాన్ని కాపాడారు కాకినాడకు చెందిన డాక్టర్ యనమదల మురళీకృష్ణ. పశ్చిమబెంగాల్ భవానిపూర్‌కి చెందిన రిటైర్డ్ ఉద్యోగి అనిరుధ్‌దాస్(71) కుటుంబ సభ్యులతో పాండిచ్చేరిలోని ఆరోవెల్లిలో ప్రఖ్యాత ప్రాంతాలను సందర్శిస్తున్నారన్నారు. ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో వాహనం ముందు సీట్లో కూర్చుని ఆయన ముందుకు వాలిపోయారు. అదే సమయంలో కుటుంబంతో మురళీకృష్ణ అదే ప్రాంతంలో ఉన్నారు. దాస్ పరిస్థితిని గమనించిన ఆయన తక్షణం వాహనం దగ్గరికి చేరుకున్నారు. గుండెపోటుకు గురయ్యారని గుర్తించారు. వెంటనే ఆయనకు సిపిఆర్ చేశారు. దీంతో రెండు నిమిషాల్లో గుండె తిరిగి కొట్టుకోవడంతో దాస్ మరణం నుంచి గట్టెక్కారు. వెంటనే అంబులెన్స్‌లో ఆయన్ని పాండిచ్చేరిలో ఉన్న జిప్మర్ మెడికల్ కాలేజీ హాస్పిటల్‌కు తరలించారు. ప్రస్తుతం అనిరుధ్ దాసు కోలుకొన్నారని ఆయన తెలిపారు. తనతండ్రి ప్రాణాన్ని రక్షించినందుకు అనిరుధ్ కుమార్తె అనీషా దాస్, అల్లుడు అభినవ్ డాక్టర్ మురళీకృష్ణకు కృతజ్ఞతలు తెలియజేశారు. జిప్‌మర్ ఆసుపత్రి వైద్యులు సురేంద్ర డాక్టర్ మురళీకృష్ణను అభినందించారు.

విజయమే లక్ష్యంగా పనిచేయాలి

వైసిపి గోదావరి జిల్లాల రీజినల్ కో-ర్డినేటర్ మిథున్‌రెడ్డి

ప్రజాశక్తి - కాకినాడరూరల్

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మిథున్‌రెడ్డి

విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని వైసిపి గోదావరి జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆర్‌టిఒ రోడ్డులోని అక్షయ ఫంక్షన్ హాల్లో వైసిపి జిల్లా స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లడారు. వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయాలన్నారు. అందుకోసం నేతలు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆయన మీడియాతో ఇష్టాగోష్టి నిర్వహించారు. పాత్రికేయులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రసంగాలు 2014 నుంచి ఒకే రకంగా ఉన్నాయన్నారు. 2019లో జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని కానివ్వనని సపథం చేసి ఓడిపోయాడన్నారు. ప్రస్తుతం కాకినాడలో యాత్రలో పవన్ కళ్యాణ్ ప్రసంగించిన తీరు అభిమానులను, ప్రజలను రెచ్చగొట్టి ఓట్లు పొందాలనే విధంగా సాగిందన్నారు. పవన్ కళ్యాణ్‌కు రాజకీయాలపై అవగాహన లేదని, టిడిపి స్క్రిప్ట్‌నే ఆయన చదువుతారని విమర్శించారు. జనసేన ఎన్నిస్థానాల్లో పోటీ చేస్తుందనేదానిపై ఆయనకే క్లారిటీ లేదన్నారు. ఇక వైసిపిని ఎక్కడ అడ్డుకుంటారని ప్రశ్నించారు. జనసేన 35 స్థానాల్లో పోటీ చేస్తామని చెప్పుకుంటుంటే, 15 సీట్లకు మించి ఇచ్చేది లేదని టిడిపి అంటుందన్నారు. సీనియర్ నేత ముద్రగడ పద్మనాభం వైసిపిలోకి వస్తానంటే తప్పక ఆహ్వానిస్తామన్నారు. ఏదేమైనా తమ అధినేత జగన్‌దే తుది నిర్ణయమన్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తరువాత డ్రగ్స్, గంజాయి కేసులు ఎక్కువయ్యాయని అనడం సబబు కాదన్నారు. చంద్రబాబు ప్రభుత్వం హయాంలోనే గంజాయి వాడకం ఎక్కువ ఉండేదన్నారు. గంజాయిని పూర్తిగా నివారించేందుకు పోలీసులు శాఖ కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లజ్ఞ పలుకుబడి పెంచుకున్న వారికే ఎంఎల్ఎ టిక్కెట్లు ఇస్తానని ముఖ్యమంత్రి చెప్పారన్నారు. కాకినాడలో సహకార బ్యాంకులు దివాళా తీయించి బ్యాంకుల ముసుగులో వైసిపి నాయకులే ప్రజల సొమ్మును దోచుకుంటున్నారు అనే విమర్శలపై కాకినాడ రూరల్ ఎంఎల్ఎ కురసాల కన్నబాబు సమాధానమిచ్చారు. బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని అన్నారు. ఎంఎల్‌సి అనంతబాబు సభపై మాట దాటవేశారు. ఎన్నికల మేనిఫెస్టోపై ఆయన మాట్లాడుతూ ప్రజలకు తమపై నమ్మకం ఉందని అదే నమ్మకంతో అదే నినాదాలతో ప్రజల ముందుకు వెళతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వంగా గీత, ఎంఎల్‌ఎలు చంద్రశేఖర్‌రెడ్డి, జక్కంపూడి రాజా, పెండెం దొరబాబు, పర్వత శ్రీపూర్ణ చంద్రప్రసాద్, జడ్‌పి చైర్మన్ వేణుగోపాలరావు పాల్గొన్నారు.

ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సుధాకర్

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కాకినాడకు చెందిన బొజ్జంగి సుధాకర్‌ను నియమిస్తున్నట్లు ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బుంగ సంజయ్ వెల్లడించారు. మాదిగల ఆత్మ గౌరవం నిలబెట్టే రాజకీయ పార్టీలకు తమ సంపూర్ణ మద్దతు ఇస్తామని ఆయన పేర్కొన్నారు. ఆదివారం స్థానిక గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన ఎంఆర్‌పిఎస్ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు పూర్తయినా మాదిగలు అభివృద్ధికి దూరంగానే ఉన్నారన్నారు. పాలకులు మాదిగల సంక్షేమాన్ని విస్మరిస్తున్నారన్నారు. మాదిగలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించే విధంగా ముఖ్యమంత్రి చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్‌సి వర్గీకరణకు వ్యతిరేకంగా బిజెపి వ్యవహరిస్తున్న రాష్ట్రంలో ఆ పార్టీని తరిమి కొడతామని హెచ్చరించారు. నూతన కార్యవర్గంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బొజ్జంగి సుధాకర్, కోనసీమ జిల్లా ఉపాధ్యక్షులుగా బొమ్మ లక్ష్మణరావు, చంద్రపురం మండల అధ్యక్షులుగా బొమ్మ రాంబాబు, కాకినాడ జిల్లా ఇన్చార్జిగా తాతపూడి మూర్తి, కాకినాడ సిటీ అధ్యక్షులుగా పలివెల విజయ్ కుమార్, కాకినాడ టౌన్ అధ్యక్షులుగా విప్పత్తి కుమార్, కాకినాడ జిల్లా కళా చైతన్య దండోరా జిల్లా అధ్యక్షులుగా మద్దాల రామారావు, కాకినాడ టౌన్ గౌరవ అధ్యక్షులుగా పెదపూడి బాబి, కాకినాడ సిటీ గౌరవ అధ్యక్షులుగా సవరపు నాగరాజు, అనపర్తి నియోజకవర్గ అధ్యక్షులుగా కాలేటి రామకష్ణ లను నియమించినట్లు తెలిపారు.

ముత్యాలమ్మ గుడి వద్ద కళాకారుల కోలాటం

ఘనంగా ముత్యాలమ్మ తీర్థం

ప్రజాశక్తి - తాళ్లరేవు

పి.మల్లవరంలో గ్రామ దేవత ముత్యాలమ్మతల్లి తీర్థం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం రాత్రి నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆలయం వద్ద కోలాటం, తప్పెటగుళ్ళు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలో మహిళలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొని గ్రామదేవతకు మొక్కులు తీర్చుకున్నారు.

నేడు డయల్ యువర్ కమిషనర్

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం ఉదయం 9:30 నుంచి 10:30 వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ చెప్పారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి సోమవారం ఉదయం 9:30 నుంచి 10:30 గంటల మధ్యలో ప్రజలు కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయం ఫోన్ నెంబర్ 0884-2357800కు కాల్ చేసి సమస్యలు తెలియజేయవచ్చునన్నారు. ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ చెప్పారు. 10:30 నుంచి స్పందన కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారం కోసమే 'గడప గడపకూ మన ప్రభుత్వం'

ప్రజాశక్తి - తాళ్లరేవు

గడప గడపకూ మన ప్రభుత్వం ద్వారా ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్నట్లు ఎంఎల్ఎ పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ తెలిపారు. చొల్లంగిపేట పంచాయతీలోని బిసి పేట, గురుకుల పాఠశాల ఏరియా, కొబ్బరి చెట్టు పేట ప్రాంతాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వరహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మట్లాడారు. ఈ నెల 27న చొల్లంగిపేటలో జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఆయా సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రాయుడు సునీత, ఎఎంసి చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, సర్పంచ్ కందిళ్ల గంగాభవాని, గంగబాబు, టిల్లపూడి నాగేశ్వరరావు, కె.నాగరాజు, మైదు హరిబాబు, కడియాల శ్రీనివాస్, గంపల నాగేశ్వరరావు, వైసిపి మండల అధ్యక్ష, కార్యదర్శులు కె.గోవింద్‌కుమార్, ఆర్.గంగాధర్, ఆర్.నరసింహమూర్తి, రత్నకుమారి, పోతాబత్తుల నూకరాజు, జమాన్, రెడ్డి నాగు , జగదీష్, మందపల్లి రాంబాబు, యానిమేటర్లు, లక్ష్మీపతి పురం గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



కరపత్రం అందిస్తున్న ఎంఎల్ఎ పొన్నాడ సతీష్

కార్టూ'నిజం'

వైసిపి నాయకులపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్, తాళ్లరేవు

కోరంగి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదును అందిస్తున్న జనసేన నాయకులు

జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ కుటుంబంపై వైసిపి సోషల్ మీడియా ఇన్‌ఛార్జి వర్రా రవీంద్రరెడ్డి సోషల్ మీడియా వేదికగా చేసిన అనుచిత వ్యాఖ్యలపై కిర్లంపూడి జనసేన నాయకులు పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ మండల అధ్యక్షులు ఉలిసి ఐరాజు మాట్లాడారు. వ్యాఖ్యలు చేసే ముందు వైసిపి నాయకుల కుటుంబాల్లోనూ మహిళలు ఉన్నారనే విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. తమ నాయకుడు పవన్ కళ్యాణ్ తమకు విలువలతో కూడా రాజకీయాలు నేర్పారన్నారు. ప్రభుత్వ వైఫల్యాలపై ప్రశ్నిస్తే వాటికి సమాధానాలు చెప్పలేని వారే ఇలా చేస్తారన్నారు. సాటి మహిళలపై వ్యక్తిగత విమర్శలు చేస్తుంటే మహిళా కమిషన్ వాసిరెడ్డి పద్మ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. అనంతరం వైసిపి నాయకులపై కిర్లంపూడి ఎస్ఐ రఘునాథరావుకి ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు జి.ప్రభాకర్, దేగల విజయ్, పిడుగు జయబాబు, ఎద్దు అర్జున్, కూనపరెడ్డి నాని, తదితరులున్నారు. తాళ్లరేవు మండలం కోరంగి పోలీస్‌స్టేషన్‌లో జనసేన మండల అధ్యక్షులు అత్తిలి బాబూరావు ఆధ్వర్యంలో నాయకులు వైసిపి నాయకుడు వర్రా రవీంద్రారెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. సోషల్‌మీడియాలో వర్రా చేసిన వాఖ్యలను వారు తీవ్రస్థాయిలో ఖండించారు. ఈ కార్యక్రమంలో వి.వీర, వి.ప్రసాద్, కె.నాని, జి.అనిల్, ఎస్.కుమార్, ఎం.బోసు, పి.సూరిబాబు, టి.త్రిమూర్తులు, వీర మహిళలు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజా సింహగర్జనను విజయవంతం చేయండి

ప్రజాశక్తి- రౌతులపూడి

విజయవాడ గుంటూరు రహదారి మధ్యలో ఉన్న యూనివర్సిటీలో ఈనెల 23న బిసి సంఘ రాష్ట్ర నాయకులు బి.రామచంద్రయాదవ్ అధ్యక్షత నిర్వహించే ప్రజా సింహగర్జన సభను విజయవంతం చేయాలని బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు గోంప శివకుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. ఆదివారం రౌతులపూడిలో ప్రజా సింహగర్జన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. అన్ని ప్రాంతాల నుంచి బిసిలు పెద్ద సంఖ్యలో హాజరై ఈ సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. దీనికి సంఘ నాయకులు, సభ్యులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోళ్ల రవి. ఎన్.రఘు, సత్తిబాబు తదితరులు ఉన్నారు.

నేరాలు ఘోరాలు

పేకాట ఆడుతున్న ఐదుగురు అరెస్ట్

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లి మండలం ఎర్రంపాలెం గ్రామ శివారు నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఎస్ఐ వై.గణేష్‌కుమార్ తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.22,500 నగదును స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో కొంతమంది అనాధికారికంగా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సారా కేసులో వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లి మండలం మురారి గ్రామ శివారు అటవీ ప్రాంతంలో అక్రమంగా నాటు సారా తయారు చేస్తున్నారనే సమచారంతో ఎస్ఐ వై.గణేష్‌కుమార్ తన సిబ్బందితో వెళ్లి దాడి చేశారు. మురారికి చెందిన కె.మోసేనును అరెస్టు చేశారు. అతని వద్ద నున్న పది లీటర్ల సారాను సీజ్ చేశారు. 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం పెద్దాపురం కోర్టుకు తరలించినట్లు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-మండపేట

స్థానిక గొల్లపుంత కాలనీలోని బ్లాక్ నెంబర్.ఎ3లోని ఫ్లాట్ 7లో ఒక వ్యక్తి ఫ్యాన్ కు ఊరు పోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎ.బుచ్చిబాబు (51) తన భర్త చనిపోయినప్పటి నుంచి మానసికంగా కుంగిపోయాడు. దీంతో పాటు ఇరుగుపొరుగు వారి వద్ద అప్పులు చేశాడు. అప్పులు తీర్చే దారి లేక మానసిక వేదనతో శుక్రవారం రాత్రి ఇంటిలోనే ఫ్యాన్ కు ఉరిపోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతని బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ కోన అప్పారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

ప్రజాశక్తి-అమలాపురం

అమలాపురం వనచర్లవారి వీధిలో శ్రీపతి మల్లేశ్వరి(24) అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఈ వివరాలను డిఎస్‌పి ఎం.అంబికాప్రసాద్ మీడియాకు ఆదివారం వెల్లడించారు. మల్లేశ్వరి ఈ నెల 7వ తేదీ నుంచి అదృశ్యమైంది. ఆమెతో గాది నాగబాబు కొంత కాలంగా సహజీవనం సాగిస్తున్నారు. అప్పటి నుంచి నాగబాబు కూడా కనిపించట్లేదు. మల్లేశ్వరి, నాగబాబులకు పుట్టిన మూడేళ్ల పాపను బంధువుల ఇంటి వద్ద వదిలి వెళ్లాడని మల్లేశ్వరి తండ్రి ఇచ్చిన ఫిర్యాదుపై ఈ నెల 8న పోలీసులు అమలాపురం పట్టణ పోలీస్ స్టేషన్లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి దర్యాప్తు చేపట్టారు. ఇందులో భాగంగా ఈ నెల 9న మహిళ మృతదేహాన్ని అమలాపురం సావరం బైపాస్ రోడ్డులోని డంపింగ్ యార్డ్ సమీపంలో కాలువలో గట్టున గుర్తించారు. మల్లేశ్వరికి గతంలో వివాహమైంది. అనంతరం భర్తను వదిలివేసింది. గాది నాగబాబుకూ గతంలో వివాహం చేసుకుని భార్యను వదిలేశాడు. వీరు ఇరువురు 2020 నుంచి సహజీనం సాగిస్తున్నారు. వీరిద్దరూ కొంతకాలం హైదరాబాదులో ఉన్నారు. ఆ తర్వాత అమలాపురానికి వచ్చారు. కేసును అమలాపురం పట్టణ సిఐ డి.దుర్గాశేఖర్ రెడ్డి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మరిన్ని వివరాలు తెలిసే అవకాశం ఉందని,అన్ని కోణాల్లో దర్యాప్తు జరుగుతుందని డిఎస్‌పి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి -దేవరపల్లి

దేవరపల్లి మండలం బంధపురం జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఆగడాల లంకకు చెందిన ఇద్దరు బైకుపై రాజమహేంద్రవరం వైపు వెళుండగా కారు వేగంగా వచ్చి ఢీకింది. ఈ ప్రమదంలో బైకుపై ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని హైవే పెట్రోలింగ్ పోలీసులు రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. వారి వివరాలు తెలియాల్సి ఉంది.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - గండేపల్లి

సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ వై.గణేష్ కుమార్ తెలిపారు శనివారం రాత్రి ఎన్.టి.రాజపురంలో నిర్వహించిన వారధి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సైబర్ మోసాలు, లోన్ యాప్ మోసాల పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనా బ్యాంక్ నుంచి ఫోన్ చేస్తున్నామని, అప్‌డేట్ కోసం ఒటిపి అడిగితే చెప్పరాదన్నారు. బ్యాంకు నుంచి ఎవరూ ఫోన్ చేయబోరని స్పష్టం చేశారు. చోరీలు జరక్కుండా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. గ్రామంలోని ప్రజల సమస్యలు తెలుసుకుని సలహాలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పోలీసులు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రమాద భరితంగా ట్రాన్స్‌ఫార్మర్

ప్రజాశక్తి-ఆత్రేయపురం

ఆత్రేయపురం రామాలయం సెంటర్లో రోడ్డు చెంతనే ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాద భరితంగా మారింది. పిల్లలకు సైతం అందే ఎత్తులో ఫీజులు అమర్చడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని పలుమార్లు కోరినా అధికారులు పట్టించుకోలేదని వాపోయారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించాలని కోరారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 94432
కాకినాడ, కోనసీమ జిల్లాల సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99189

విద్యార్థులకు ఉచిత బస్ పాసులు

ప్రజాశక్తితో ఆర్‌టిసి కాకినాడ జిల్లా డిపో మేనేజర్ మనోహర్

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ఎండా వేసెలవుల అనంతరం పాఠశాలలు, కళాశాలలు తెరుచుకున్న నేపథ్యంలో అర్హులైన విద్యార్థులకు ఉచిత బస్సు పాసులు జారీ చేస్తున్నామని ఆర్‌టిసి కాకినాడ డిపో మేనేజర్ ఎంయువి.మనోహర్ తెలిపారు. కొత్త విద్యా సంవత్సరానికి విద్యార్థులకు బస్సు పాసులు జారీ చేసే ప్రక్రియను కొనసాగిస్తున్నట్లు చెప్పారు. పాఠశాలలు, కళాశాలకు వెళ్లే విద్యార్థులకు అర్హతను బట్టి ఉచిత, రాయితీ బస్సు పాసులు తీసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సందేహాలుంటే డిపోలో సంప్రదించి వివరాలు తెలుసుకోవాలన్నారు. ప్రజాశక్తి ముఖాముఖిలో ఇంకా పలు అంశాలపై ఆయన మాట్లాడారు.

ఏటా ఎన్ని పాసులు జారీ చేస్తున్నారు.

కాకినాడ డిపోలోని కౌంటర్లో గత నెల 12 నుంచి బస్ పాసులు జారీ ప్రక్రియ మొదలైంది. సుమారు 6 వేలకు పైగా ఉచిత, 11 వేలకు పైగా ఇతర పాసులు అందజేస్తున్నాము. ఉచిత పాసులు కావాల్సిన వారు దరఖాస్తులను డిపోలో అందజేయాలి. వాటిని పరిశీలించిన అనంతరం పాసులు అందిస్తాం. ఆన్ లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. విద్యార్థులకు ఎటువంటి సందేహాలు ఉన్నా వెంటనే డిపోలోని సిబ్బంది, ఉద్యోగులను సంప్రదించాలి.

ఉచిత పాస్ కోసం ఏం చేయాలి.?

కొత్తగా బస్సు పాసు తీసుకునేవారు దరఖాస్తు పూర్తిచేసి ఆధార్ కార్డు జిరాక్స్, చదువుకి సంబంధించిన సర్టిఫికెట్లను జత చేసి డిపోలో ఇవ్వాలి. ఏడో తరగతి వరకు చదివే 12 ఏళ్లలోపు బాలురు, పదోతరగతి వరకు చదివే 18 ఏళ్ల లోపు బాలికలు ఉచిత పాసులకు అర్హులు. అప్లికేషన్‌పై పాస్ పోర్టు సైజు ఫొటో అతికించి పాఠశాల ప్రధానోపాధ్యాయుడి సంతకంతో పాటు స్టాంపు వేయాలి. అనంతరం బస్సు పాసును అధికారులు జారీ చేస్తారు. ఇవి వచ్చే ఏడాది ఏప్రిల్ వరకు చెల్లుతాయి.

రాయితీపై పాసులు ఎవరెవరికి జారీ చేస్తారు.?

కాకినాడ ఆర్‌టిసి డిపోలోని కౌంటర్లో ఉచిత బస్సు పాసులతో పాటు రాయితీ పాసులు కూడా జారీ చేస్తున్నారు. ఇందుకు ఇంటర్మీడియట్, డిగ్రీ, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్, ఇతర కోర్సులు చదివే విద్యార్థులు అర్హులు. ఇంటి నుంచి విద్యా సంస్థకు మధ్య దూరం, కాల వ్యవధిని బట్టి ధర నిర్ణయిస్తారు. విద్యార్థులు సంబంధిత సర్టిఫికేట్లతో దరఖాస్తు పూర్తి చేసి ఇస్తే రూ.50 సొమ్ము కట్టించుకుని ఐడీ కార్డు ఇస్తారు. మొదటిసారి ఏ కాలపరిమితి పాసు తీసుకున్నారో తర్వాత రెన్యువల్ పాసు కూడా అదే కాల పరిమితితో జారీ చేస్తారు. రెన్యువల్‌కు ఆర్‌టిసి నిర్దేశించిన రుసుం చెల్లించాల్సి ఉంటుంది. అదనపు సమాచారం కోసం సంబంధిత డిపో మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్ ఇతర ఉద్యోగులను సంప్రదించాలి.నెల, మూడు, నెలలు, ఏడాది పాటు చెల్లు బాటు అయ్యేలా పాసులు ఇస్తాము.

జర్నలిస్టులకు ఎన్ని పాసులు జారీ చేస్తున్నారు.?

సమాచార శాఖ అధికారులు పంపిన జాబితా ప్రకారం జిల్లాలో సుమారు 300 మంది జర్నలిస్టులకు జిల్లా, స్టేట్ అక్రిడిటేషన్లు కలిగిన వారికి బస్సు పాసులు ఉచితంగా జారీ చేస్తున్నాం. ఇప్పటికే ఈ ప్రక్రియ కొనసాగుతుంది. ఈ ఏడాది డిసెంబర్ 31 వరకు కాల పరిమితితో బస్సు పాసులు ఇస్తున్నాము.

నేటి నుంచి పలు రైళ్లు రద్దు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

ఈ నెల 10వ తేదీ నుంచి 16వ తేదీ వరకూ విజయవాడ వద్ద చేపట్టిన ట్రాక్ రోలింగ్ కారిడార్ పనుల కారణంగా సామర్లకోట మీదుగా రాకపోకలు సాగించే పలు రైళ్లను రద్దు చేసినట్లు రైల్వే ఉన్నతాధికారులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం సామర్లకోట రైల్వే అధికారులకు ఆదేశాలు అందినట్లు రైల్వే స్టేషన్ మేనేజర్ రమేష్ తెలిపారు. ఈ కారణంగా ట్రైన్ నెంబర్ 17267 కాకినాడ-విశాఖ మధ్య నడిచే రైలును ఈ నెల 10 నుంచి 16 వరకూ రద్దు చేశారు. విశాఖ-కాకినాడ మధ్య నడిచే రైలు 17268ను ఈ నెల 10 నుంచి 16 వరకూ రద్దు చేశారు. 17239 నంబరు గల గుంటూరు-విశాఖ మధ్య నడిచే సింహాద్రి ఎక్స్‌ప్రెస్ ఈ నెల 16 వరకూ రద్దు చేశారు. 17240 నంబరు గల విశాఖ-గుంటూరు మధ్య నడిచే సింహాద్రి ఎక్స్పెస్ ఈనెల 10 నుంచి 17 వరకూ రద్దు చేశారు. 07466 నంబరు గల రాజమహేంద్రవరం-విశాఖ మధ్య నడిచే రైలు ఈ నెల 10 నుంచి 16 వరకు రద్దు చేశారు. 07467 నంబరు గల విశాఖ-రాజమ హేంద్రవరం మధ్య నడిచే రైలు ఈ నెల 10 నుంచి 16 వరకూ రద్దు చేశారు.

దారి మళ్లించిన రైళ్లు

ట్రైన్ నెం.13351 నంబరు గల ధన్‌బాద్-అలెప్పీ మధ్య నడిచే బొకారో ఎక్స్‌ప్రెస్ ఈ నెల 11,14,15 తేదీల్లో నిడదవోలు-భీమవరం-గుడివాడ మీదుగా విజయవాడ వెళుంది. 12835 నంబరు గల హటియా-బెంగుళూరు మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ ఈ నెల 11న నిడదవోలు -భీమవరం-గుడివాడ మీదుగా విజయవాడ వెళ్తుంది. 12889 నంబరు గల టాటా-బెంగుళూరు మధ్య నడిచే ఎక్స్ ప్రెస్ రైలు ఈ నెల 14న నిడదవోలు-భీమవరం-గుడివాడ మీదుగా విజయవాడ వస్తుంది. 18637 నంబరు గల హటియా-బెంగళూరు మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 15న నిడదవోలు-భీమవరం-గుడివాడ మీదుగా విజయవాడ వెళ్తుంది.

వైసిపిని సాగనంపుదాం...

మాజీ ఎంఎల్‌ఎ అనంతలక్ష్మి, నాయకులు సత్యనారాయణమూర్తి

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

మత్స్యకారులకు తీరని అన్యాయం చేసిన వైసిపి ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో సాగనంపుదామని కాకినాడ రూరల్ మాజీ ఎంఎల్‌ఎ పిల్లి అనంతలక్ష్మి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. ఆదివారం నేమాంలో మినీ మేనిఫెస్టో ప్రచారంలో భాగంగా 'వస్తున్నా- మీ గ్రామానికి - మీ అనంతలక్ష్మి' 10వ రోజు కార్యక్రమాన్ని నిర్వహించారు. మినీ మేనిఫెస్టో కరపత్రాలను ఇంటింటా పంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. టిడిపి హయాంలో మత్స్యకారుల సంక్షేమం కోసం అమలు చేసిన పథకాలను జగన్ సర్కారు రద్దు చేసి మత్స్యకారుల జీవనోపాధికి గండికొట్టిందన్నారు. వేట నిషేధ సమయంలో ప్రతి మత్స్యకారుడికి భృతి అందించగా, నేడు అనేక కారణాలు చూపుతూ కొందరికే వైసిపి సర్కారు పరిహారం అందించిందన్నారు. టిడిపి హయాంలో మత్స్య సహకార సంఘాల అభివృద్ధికి పలు పథకాలను చేపట్టామన్నారు. సంఘాల సభ్యులకు పనిముట్లు ఐస్‌బాక్సులు, సైకిళ్లు, ద్విచక్రవాహనాలు వివిధ రకాల పథకాలను 75 శాతం సబ్సిడీతో అందించామన్నారు. సహకార సంఘాల సభ్యులు ఇంటి నిర్మాణాల కోసం ప్రభుత్వ ఆర్థిక సహకారంతో పాటు మత్స్యశాఖ అదనంగా రూ.37,500 ఇచ్చేవారమన్నారు. చేపలు పడుతూ ప్రమాదవశాత్తు మరణిస్తే సభ్యునికి బీమా సౌకర్యం కల్పించేవారమన్నారు. నేడు వైసిపి సర్కారు వీటినన్నింటీని పక్కన పెట్టిందన్నారు. మత్స్యకారులను నమ్మించి మోసం చేసిన జగన్‌రెడ్డి చరిత్రహీనుడిగా మిగిలిపోతాడని విమర్శించారు. టిడిపి అధికారంలోకి రాగానే తప్పకుండా మత్స్యకారుల కుటుంబాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్‌పి కో ఆప్షన్ మాజీ సభ్యుడు మట్టా ప్రకాష్‌గౌడ్, నాయకులు గుబ్బల శివ, అడపా రాజబాబు, వి.శివ, జి.రమణ, ఎల్.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎంఎల్‌ఎ పిల్లి అనంతలక్ష్మి నాయకులు

సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

సమస్యలపై పోరాడేది సిపిఎం మాత్రమే...

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

సమస్యలపై పోరాటం చేసేది సిపిఎం మాత్రమేనని ఆ పార్టీ జిల్లా కన్వీనింగ్ కమిటీ సభ్యులు జి.బేబిరాణి అన్నారు. సిపిఎం జనరల్ బాడీ సమావేశం కొత్తపల్లి సిఐటియు కార్యాలయంలో నాయకులు కాళ్ల నాగేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సమవేశంలో బేబిరాణి మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల్లో వారం రోజులుగా తాగునీరు బురదమయంగా వస్తున్నాయన్నారు. ప్రజలు అనారోగ్యంతో బాధపడుతున్నారన్నారు. కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులిచ్చి వ్యవసాయ రుణాలు ఇవ్వాలన్నారు. ఉప్పాడలో నిర్మిస్తున్న మినీ హార్బన్‌ను నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేయాలన్నారు. డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపర్చాలన్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో నాణ్యతను పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. వర్షాకాలం నేపథ్యంలో పొలాలు మునిగిపోకుండా ముందుగానే డ్రెయిన్లను బాగు చేయాలన్నారు. ఏటిగట్లు, కాలువ గట్లను బలపర్చాలన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.అప్పారెడ్డి, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి సిహెచ్.సాంబశివకుమార్, సిఐటియు కార్యదర్శి సత్యనారాయణ మహిళా సంఘం నాయకులు సునీత, శ్రీను, నారాయణ రెడ్డి, వెల్లంకి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని పెదబ్రహ్మదేవం ఎంపిటిసి సభ్యులు మలకల సూర్యారావు (సూరిబాబు) తదితరులు పిలుపునిచ్చారు. ఆదివారం ఎంపిటిసి సభ్యులు సూరిబాబు భార్య కీర్తిశేషులు మలకల పద్మావతి జయంతి సందర్భంగా మహిళలకు చీరల పంపిణీ, మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత పద్మావతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుమారు 150 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో గల శ్రీ వేణు గోపాల్ నగర్ కాలనీలో మొక్కలు నాటారు. సూరిబాబు మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి అందరూ సహకరించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా, పచ్చని చెట్లతో ఆహ్లాదకరంగా ఉంచాలని కోరారు. భావితరాలకు పచ్చని పర్యావరణాన్ని అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని జాతీయ పర్యావరణ మిత్ర అవార్డు గ్రహీత తోటకూర గంగాధర్ అన్నారు. ఈ కార్యక్రమంలో విజయవాడ జికె ఆసుపత్రి అధినేత డాక్టర్ జి.గౌతమ్‌కృష్ణ, సర్పంచ్ నీలపాల సత్యనారాయణ, వైస్ సర్పంచ్ మలకల సత్య, సొసైటీ అధ్యక్షులు వరాల బాబు, పంచాయతీ సభ్యులు తోటకూర దుర్గాలక్ష్మి, తోటకూర వెంకటేశ్వరరావు(బాబ్జి) వైసిపి నాయకులు గ్రామ పెద్దలు, సచివాలయం సిబ్బందిపాల్గొన్నారు.

మొక్కనాటున్న సూర్యారావు

విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

రెండు దశాబ్దాల క్రితం విద్యనభ్యసించిన 2002-03 పదో తరగతి విద్యార్థుల సమ్మేళనం ఆదివారం స్థానిక అయోధ్యరాంపురం మున్సిపల్ హైస్కూల్‌లో ప్రస్తుత హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ అధ్యక్షతన ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్నేహితుల కుశలప్రశ్నలు, అలనాటి ముచ్చట్లతో ప్రాంగణంలో సందడి నెలకొంది. తొలుత అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షత వహించిన సాయిరామకృష్ణ మాట్లాడుతూ ఇరవై ఏళ్ల క్రితం విద్యను అభ్యసించి, వివిధ రంగాల్లో స్థిరపడి అప్పటి టీచర్లను గుర్తుంచుకొని సత్కరించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు వివిధ రంగాల్లో రాణించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. నిర్వాహకులు వానపల్లి రత్నకుమార్, బర్లంకి ప్రసాద్, బిక్కిన వెంకట్, గంగాధర్ ప్రసాద్, రమేష్, వరలక్ష్మి, భవాని,ఆవాల నవీన్, కె.శ్రీనివాసు తదితరులు తమ అనుభవాలను పంచుకొన్నారు. రిటైర్డ్ టీచర్లు వి.పాండురంగవిఠల్, ఆదిరాజు శ్రీరామచంద్రమూర్తి, సిహెచ్.సూర్యకాంతం, కె.నాగమణి, ఎపి.రాజేంద్రకుమార్, ఎండ్రు ప్రభాకరరావు, ఎమ్‌డి.షఫీ, ప్రస్తుతం హెచ్ఎంలుగా పనిచేస్తున్న తాండ్ర శ్యామ్‌సుందర్, యు.సత్యనారాయణ, వ్యాయామ ఉపాధ్యాయులు తాళ్లూరి వైకుంఠం తదితరులు మాట్లాడారు.

అప్రజాస్వామిక పాలనను అంతం చేద్దాం

ద్రాక్షారామ సభలో టిడిపి నాయకులు

ప్రజాశక్తి - రామచంద్రపురం

అప్రజాస్వామికంగా జరుగుతున్న జగన్ పాలనను అంతమొందించాలని టిడిపి సీనియర్ నాయకులు మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. భవిష్యత్తుకు భరోసా పేరుతో ద్రాక్షారామంలో నిర్వహించిన బహిరంగ సభలో టిడిపి నాయకులు మాజీ మంత్రులు ఎంఎల్‌ఎలు పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి వైసిపి ప్రభుత్వం తీసుకెళ్లిందన్నారు. నిత్యావసర వస్తువుల అధిక ధరలతో, అధిక పన్నులతో సామాన్యులు జీవితం అస్తవ్యస్తం అయ్యిందన్నారు. ఇసుక, మట్టి మాఫియా ఆగడాలకు అంతం లేకుండా పోయిందన్నారు. అన్ని రంగాల్లోనూ అవినీతి మరింత పెరిగిందని ఆరోపించారు. 2024లో ప్రజలంతా ఏకమై జగన్ రెడ్డిని ఇంటికి పంపాలనిన్నారు. రాష్ట్రాన్ని ముందుకు నడిపే సత్తా చంద్రబాబునాయుడుకే ఉందన్నారు. బాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసన మండలి డిప్యూటీ చైర్మన్, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి సుబ్రహ్మణ్యం, మాజీ మంత్రులు గొల్లపల్లి సూర్యారావు, చిక్కాల రామచంద్రరావు, టిడిపి నాయకులు గంటి హరీష్‌మాథూర్, రెడ్డి అనంతలక్ష్మి, మాజీ మంత్రులు బండారు సత్యానందం, దాట్ల బుచ్చిరాజు, నాయకులు డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, చింతపల్లి వీరభద్రరావు, మేడిశెట్టి రవికుమార్ పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

మల్లిపూడి వెంకటలక్ష్మి అను నాకు విశాఖపట్నం పాస్‌పోర్టు కార్యాలయం అధికారులు ది.15-09-2014న **VS 1067941399314** అప్లికేషన్ నెంబరు గల పాస్‌పోర్టు మంజూరు చేసియున్నారు. సదరు పాస్‌పోర్టు **ది.07-07-2023**వ తేదీన నేను తోగమ్మి నా ఇంటి నుండి తణుకు మెడికల్ టెస్టు నిమిత్తం వెళ్ళుటకు మా తమ్ముడు ఇంటి వద్దకు వెళ్ళి కొవ్వూరు వాటర్ ట్యాంకు వద్ద గల జిరాక్సు షాపు వద్దకు జిరాక్సు తీయించుకుని తిరిగి మా తమ్ముడి ఇంటికి వెళ్ళి చూసుకోగా మార్గమధ్యలో పడిపోయినది. పైన తెలిపిన పాస్‌పోర్టు ఎవకిరైనా దొరికిన ఎడల ఈ క్రింది అడ్రసుకు తెలియ పర్చవలసిందిగా కోరుచున్నాను.

మల్లిపూడి వెంకటలక్ష్మి
భర్త: (లేటు) వీర్రాజు, డో.నెం.2-126/1,
ఇందిరా గాంధీ వీధి, తోగమ్మి,
కొవ్వూరు మండలం, తూ॥గో॥జిల్లా.
సెల్: 88811 53349

యానాం వార్తలు

నకిలీ సర్టిఫికెట్లతో ప్రభుత్వ ఉద్యోగాలు

కేంద్రానికి ఎంఎల్‌ఎ అశోక్ ఫిర్యాదులు ఫలించేనా?

ప్రజాశక్తి - యానాం

అన్ని అర్హతలు ఉండి కూడా ప్రభుత్వ ఉద్యోగం సాధించలేక ఎంతో మంది యువకులు అల్లాడిపోతున్నారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం చాలా ఏళ్లుగా కష్టపడుతుంటారు. కాని కొందరు ప్రబుద్ధులు మాత్రం అడ్డదారుల్లో దొంగ సర్టిఫికెట్లను సష్టించి వాటితో ప్రభుత్వ ఉద్యోగాలను సైతం పొందుతున్నారు. తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సమర్పించి ఉపాధ్యాయునిగా కొనసాగుతూ ఇటీవల కాలంలో విజిలెన్స్ అధికారుల విచారణలో దొరికిపోయాడు. అంతేకాకుండా ప్రస్తుతం విద్య, వైద్య రంగాల్లో సుమారు 75 మందికి పైబడి నకిలీ ధ్రువపత్రాలతో ఉద్యోగాలు పొందారని పలువురు ఆరోపిస్తున్నారు. వీరిపై ప్రభుత్వం గాని, ఉన్నత స్థాయి అధికారులు గాని ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. యానాం నియోజకవర్గంలో చాలామంది వివిధ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న చాలా మంది దొంగ సర్టిఫికెట్లతో ప్రభుత్వ ఉద్యోగాలు పొందారని అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎంఎల్‌ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌కు యానాం నిరుద్యోగులు ఫిర్యాదులు చేస్తున్నారు. దీనిపై స్పందించిన ఆయన కేంద్రానికి ఫిర్యాదు చేశారు.

నకిలీ ఉద్యోగులపై చర్యలు తప్పవు : ఎంఎల్‌ఎ అశోక్

యానాం నిరుద్యోగుల ఫిర్యాదుల మేరకు నకిలీ పత్రాలతో ఉద్యోగం పొందినట్టు రుజువైతే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే అలాంటి ఉద్యోగులకు సంబంధించిన పూర్తి వివరాలు సేకరించాం. వీటినిరాష్ట్ర ప్రభుత్వానికి, కేంద్ర ప్రభుత్వానికి అందించామం. నిరుద్యోగులకు న్యాయం చేస్తాం.

పేరు మారింది..కిట్ ఆగింది

రెండేళ్లుగా నిలిచిన వైఎస్ఆర్ కిట్ల సరఫరా
శిశువుల తల్లులపై ఆర్థిక భారం
పట్టించుకోని ప్రభుత్వం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

మాతా శిశు సంరక్షణకు ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయి. అందులో భాగంగా చిన్నారుల సంరక్షణకు ఉపయోగపడే బేబీ కిట్ల ఆసుపత్రుల్లో ప్రసవించిన తల్లులకు ఉచితంగా ప్రభుత్వమే గతంలో పంపిణీ చేసేది. 2019లో వైసిపి అధికారంలోకొచ్చిన తరువాత పథకం పేరును వైఎస్ఆర్ బేబి కిట్లుగా మార్చారు. కొన్నాళ్ల పాటు ఈ ఉచిత పంపిణీని కొనసాగించారు. రెండేళ్ల నుంచి కిట్ల సరఫరా నిలిపేసింది. దీంతో పేద, మధ్య తరగతి కుటుంబాల తల్లులపై ఆర్థిక భారం పడుతోంది.

20వెలకు వేలకు పైగా ప్రసవాలు

కాకినాడ జిల్లాలో 2021 ఏప్రిల్ నుంచి2023 జూన్ 30 వరకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో 20 వేలకు పైగా ప్రసవాలు జరిగాయి. గతంలో ప్రభుత్వ వైద్యశాలలో ప్రసవం కాగానే రూ.2 వేల విలువ గల బేబీకిట్‌లను తల్లికి అందించేవారు. ఇందులో శిశువు నిద్రించడానికి అనువుగా చిన్న పరుపు, చేతులు శుభ్రం చేసుకునే ద్రావణం, దోమల నుంచి కాపాడేందుకు గొడుగు, దుప్పటి, న్యాప్కిన్, డైపర్స్, బేబీ పౌడర్, టవల్‌తో పాటు బేబి సోప్స్ ఉండేవి. శిశువులకు ఇతరుల ద్వారావైరస్, ఇతర సూక్ష్మజీవులు వ్యాప్తి చెందకుండా ఉండేలా బేబీ కిట్ ఉండేది. వాటి పంపిణీ ప్రస్తుతం నిలిపివేయడంతో అప్పుడే పుట్టిన చంటి బిడ్డల సంరక్షణ కోసం తల్లులు వీటిని బహిరంగ మార్కెట్లో కొనుగోలు చేసుకోవాల్సి వస్తోంది. జిజిహెచ్, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవం కోసం వచ్చే వారు బహిరంగ పేద, మధ్య తరగతివారే ఉంటున్నారు. ప్రభుత్వం బేబీకిట్లు సరఫరా చేయకపోవడంతో వారంతా తమ శిశువుల సంరక్షణకు అవసరమైన సామగ్రిని బహిరంగ మార్కెట్లో అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రుల నుంచి బేబీ కిట్లు సరఫరా చేయాలని ప్రతిపాద నలు పంపినా ప్రభుత్వం నుంచి స్పందన లేదు.

అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

జగ్గంపేట ఐసిడిఎస్ ప్రాజెక్టులో పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ హెల్పర్ల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సిడిపిఒ పూర్ణిమ తెలిపారు. వీరవరం సెంటర్ 7లో (ఒసి), ఎస్ఆర్ పేట సెంటర్-2లో (ఒసి), రామవరం సెంటర్-3లో ఎస్‌సి మహిళా రిజర్వేషన్లు కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను ఈనెల 8 నుంచి 17లోపు ప్రాజెక్ట్ కార్యాలయంలో అందజేయాలన్నారు. దరఖాస్తుదారులు 21 నుంచి 35 ఏళ్లలోపు వారు అర్హులన్నారు. అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు.

NOTICE

మహారాజశ్రీ కొవ్వూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S. 115/2022

Between:

వాది: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కొవ్వూరు బ్రాంచి.

ప్రతివాదులు:

Smt. Kotcherlakota Usha and 2 Others

To:

1. Smt. Kotcherlakota Usha, W/o. late Subrahmanyam, D.No. 3-92/1, Arikirevula, Kovvur Mandal, E.G.Dt.,
2. Master K.L.S.Bhuvanesh, S/o. late Subrahmanyam.
3. Master K.S.P.Shanmukham, S/o. late Subrahmanyam.

2, 3 ప్రతివాద్దు మైనర్లు అయినందున గార్డియన్ తల్లి 1వ ప్రతివాది *Smt. Kotcherlakota Usha, W/o. late Subrahmanyam, D.No. 3-92/1, Arikirevula, Kovvur Mandal, E.G.Dt.,*

పై నెంబరు దావాను వాది, 1 to 3 ప్రతివాదులుపై పై నెంబరు దావా బాకీ వసూలు నిమిత్తం దాఖలు చేసుకొని కోర్టు ద్వారా మరియు పోస్టు ద్వారా ఎన్నిసార్లు సమనులు బేటా కట్టినప్పటికిన్నీ అమలు కానందున శ్రీ కోర్టు వారు Substitute Service ద్వారా ఆర్డరు వేసి వున్నారు. కావున పై నెంబరు దావాలో మీకు ఏమైనా ఆక్షేపణలు వున్న యెడల మీరు **ది. 19-7-2023**వ తేదీ ఉదయం **గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుల హాజరై తెలియపరచుకొనవలెను. లేనిచో మీ పరోక్షమున తీర్మానించడమగును.

MADDIPATI SRINIVAS
Advocate, Kovvur
Cell: 8500525965

In The Court Of 2nd Addl. Senior Civil Judge Rajamahendravaram

I.A.No.86/2023, O.S.No.8/2020

Between:

Chatrathi Ganga Dhara Rama Rao
...Petitioner /Plaintiff

AND

1) Gadde Veera Venkata Satyanarayana and 8 Others
...Respondents /Defendants

Proposed Parties 5 to 9:

5) Sirigina Surya Rao, S/o. Not Known, Hindu, aged 75 Years, Property, D.No. 5-7, Rangampet, Rangampet Mandal, E.G.Dist. P.J.C.J.
6) Kunujula Anantha Lakshmi, W/o. Rambabu, Hindu, aged 50 Years, House Wife, D.No. 5-7, Rangampet, Rangampet Mandal, E.G.Dist. P.J.C.J.
7) Sirigina Krishna, S/o. Surya Rao, Hindu, aged 47 Years, Property, D.No. 5-7, Rangampet, Rangampet Mandal, E.G.Dist. P.J.C.J.
8) Bolla Mangatayaru @ Lalithamma, W/o. Rambabu, Hindu, aged 45 Years, Property, Nandarada, C/o. Sirigina Surya Rao, Hindu, aged 75 Years, Property, D.No. 5-7, Rangampet, Rangampet Mandal, E.G.Dist. P.J.C.J.
9) Ralla Bhavani, W/o. Veeranjaneyulu, Hindu, aged 42 Years, Property, C/o. Sirigina Surya Rao, Hindu, aged 75 Years, Property, D.No. 5-7, Rangampet, Rangampet Mandal, E.G.Dist. P.J.C.J.

పై నెంబరు దావాలో 4వ ప్రతివాది మీలో 5వ వార్కి భార్య గారున్నూ, 6,7,8,9 వార్లకు తల్లిగారు అయి శిరిగిన వీర్రాజు గారు మరణించినట్లు కోర్టు వారు పంపిన సమన్లు తిరిగి వచ్చుట ద్వారా తెలిపినందున పై గ్రంథములో మిమ్ములను 5 టు 9 ప్రతివాదులుగా చేర్పించమని ఐ.ఎ.నెం. 86/2023 పిటీషను దాఖలు చేసి మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపిననూ అందుకొనక కాలయాపన చేయుచున్నందున పై గ్రంథము మీ హాజరు నిమిత్తం **ది.19-07-2023**నకు వాయిదా. కావున **ఆరోజు ఉదయం గం॥ 10:30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు పై కోర్టు వారితో మనవి చేసుకోవలెను. లేని ఎడల పై గ్రంథము మీ పరోక్షమేన తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

ఇంద్రగంటి విశ్వనాథం
పిటీషనరు తరుపు అడ్వకేట్,
రాజమండ్రి. సెల్: 98495 79614